# నువ్వుగింజ


## మోటూరి రాధ

"చాల్లే ఆపు! చేసిన పని చాలక పైగా ఒట్లెందుకు?"

"ప్లీజ్ అరుణా! నేనెలాంటి దాన్నో తెలిసి కూడా నువ్విలా అభాండాలు వెయ్యడం బాగుండలేదు. నీకు అపకారం చేసే మనిషినా


అరుణ రామలక్ష్మి కేసి నిప్పులు కక్కుతూ చూసింది.


"బుకాయించబాకు. ఇంత వరకూ ఈ రహస్యం నీకూ నాకూ తప్ప ఇంకెవ్వరికీ తెలియదు. నీతో తప్ప ఇంకెవ్వరితోనూ నేనా విషయం మాట మాత్రంగానైనా అనలేదు.



అలాంటి దివ్వాళ మన కాలనీలో అందరూ దాన్ని గురించే చెవులు కొరుక్కుంటున్నారూ అంటే - ఇది కచ్చితంగా నీ పనే అయ్యుంటుంది. నువ్వే లీక్ చేసుంటావ్" అంది ఆవేశంతో రొప్పుతూ.

"ఒట్టరుణా! నన్ను నమ్ము. ఎలా లీకైందో నాకూ తెలియదు. నేను మాత్రం ఎవ్వరితోనూ అన్లేదు." అని రామలక్ష్మి ఇంకా ఏదో చెప్పబోతుంటే కస్సుమంటూ ఆమె కడ్డుపడింది అరుణ -





నేను? ఇన్నాళ్ల మన స్నేహంలో ఇంతేనా నువ్ నన్నర్థం చేసుకుంది?" దీనంగా చూసింది రామలక్ష్మి.

ఆ దీన వీక్షణానికి అరుణ శాంతించకపోగా మరింతగా రెచ్చి పోయింది.

"ఇన్నాళ్లూ నువ్ నిజంగా నా స్నేహితురాలివే అనుకున్నాను. నా క్షేమాన్ని కోరుకునే దానివే అనుకున్నాను. ఆ అపోహతోనే నోరూరుకోక నీతో ఆ సంగతి చెప్పాను. రహస్యంగా ఉంచమని అంతగా చెబితే - ఛీ! చివరికిలా చేస్తావనుకోలేదు' అంది ఈసడింపుగా.

అరుణ నుండి ఏనాడూ ఆప్యాయతాభిమానాలనే తప్ప, ఇలాంటి ఛీత్కారాన్ని ఎదుర్కొని ఉండని రామలక్ష్మి ఖిన్నురాలైంది.

అరుణని ఎలా నమ్మించడం?

తన నిర్దోషిత్వాన్ని ఎలా రుజువు చేసుకోవడం?

దుఃఖంతో కంఠం పూడుకు పోతున్నట్టుగా అనిపించింది రామలక్ష్మికి. బలిమిన కంఠాన్ని పెగలించుకొని చివరి ప్రయత్నంగా అంది. "నువ్ నా మాట నమ్మటం లేదు. కావాలంటో గుళ్లో అమ్మవారి ముందు దీపం పెట్టి ప్రమాణం చేస్తాను. వెళ్దాం పద..."

రామలక్ష్మి మాటలు అరుణని సందిగ్ధంలో పడేశాయి.అమ్మవారంటే రామలక్ష్మికి ఎంత భయభక్తుల్లో అరుణకి బాగా తెలుసు. ఆ విషయంలో మాత్రం రామలక్ష్మి ఈ కాలంలో జన్మించాల్సిన మనిషేకాదు. అమిత భక్తిశ్రద్ధలతో అమ్మవారికి ఆమె చేసే నిత్య పూజలు అరుణకెప్పుడూ ఆశ్చర్యాన్నే కలిగిస్తుంటాయి. అమ్మవారి ముందు రామలక్ష్మి అసత్యం చెప్పగలగటం అసాధ్యం.

చేత్తో తీసిపారేసినట్టు సడన్‌గా అరుణ మనసులోంచి రామలక్ష్మి మీద అనుమానం తొలగిపోయింది.

కాని... రామలక్ష్మి చెప్పకపోతే మరి ఆ సంగతి బయటికెలా పొక్కినట్టు? - అర్థం కాలేదు అరుణకి.

ఆ మాటే అంది రామలక్ష్మితో - "సరే రామలక్ష్మీ! అమ్మవారి ప్రస్తావన తెచ్చావు కాబట్టి ఈ రహస్యాన్ని నువ్ బయట పెట్టలేదని నేను నమ్ముతాను. కాని... ఎలా... ఎలా తెలిసింది అందరికీ?"

బదులివ్వటానికి రామలక్ష్మి వద్ద సమాధానం ఉంటే కదా? ఎటో చూస్తూ మిన్నకుండి పోయిందామె.

"మళ్లీ అడుగుతున్నాని మరోలా అనుకోకు. మీవారితోగాని అన్నావేమో బాగా జ్ఞాపకం చేసుకో..." - తన భర్తతో కూడా చెప్పలేదని రామలక్ష్మి అంతకుముందే స్పష్టం చేసినప్పటికీ మనసులో ఏ మూలనో ఇంకా అనుమానం చావక అడిగింది అరుణ.

రామలక్ష్మి చటుక్కున తలతిప్పి అరుణ కళ్లలోకి సూటిగా చూసింది. "ఇంకా... ఇంకా సందేహిస్తూనే ఉన్నావా నన్ను?"

రామలక్ష్మి చూపు నెదుర్కోలేక చప్పున తలదించుకుంది అరుణ. "లేదులే గాని..." అంటూ ఆగిపోయింది ఏం చెప్పాలో తోచక.

"ఎందుకొదినా అలా బుర్రలు బద్దలు గొట్టుకుంటారు?" అంటూ అప్పుడే ఆ గదిలోకి ప్రవేశించిన, శ్రావణి, సోఫాలో వాళ్లిద్దరి మధ్యా సందు చేసుక్కూర్చుంది.

శ్రావణి ఈ హఠాత్తుగా ఊడిపడ్డం స్నేహితురాళ్లిద్దర్నీ బిత్తర పోయేలా చేసింది. ఇద్దరి ముఖాలూ కత్తివాటుకి నెత్తురు చుక్కలేనట్టుగా పాలిపోయాయి. శ్రావణి మాటల్ని బట్టి ఆమె తమ సంభాషణ ఆలకించేసిందని తెలుస్తూనే ఉంది.


"నీ స్నేహితురాలు రామలక్ష్మి నిర్దోషొదినా! ఆ సంగతి మంజులతోనూ, సరళ తోనూ నేనే చెప్పాను."

శ్రావణి అలా అంటుంటే మతి పోయినట్టే అనిపించింది స్నేహితురాళ్లిద్దరికీ. తమ చెవుల్ని తామే నమ్మలేక పోతున్నట్టుగా చూశారామె కేసి.

ఎవ్వరూ తన వేలితో తన కన్నే పొడుచుకోరు కదా? మరి శ్రావణి తానే చెప్పానంటోందేమిటి?!

వాళ్లే కాదు, వాళ్ల స్థానంలో వేరెవరున్నా అలాగే ఆశ్చర్యపోతారు. ఎందుకంటే.. అసలు జరిగిన సంగతేమిటంటే...

శ్రావణి అరుణకి ఆడపడుచు. గుంటూర్లో తల్లిదండ్రుల వద్ద ఉంటూ సెకండియర్ బియ్యే చదువుతున్న శ్రావణి కాలేజీలో ఎవరో అబ్బాయితో ప్రేమలో పడింది. ఆమె పుస్తకాల్లో దొరికిన ఉత్తరాల్ని బట్టి ఆ విషయం గ్రహించిన ఆమె తల్లిదండ్రులు "ఇలాంటి పాడు పోకడలు మన ఇంటా వంటా లేవు. నీకిదేం పొయ్యేకాలం?"




అంటూ ఆమెని మందలించి, అర్ధాంతరంగా ఆమె చదువు మాన్పించేసి అన్న గారింటికి పంపించేశారు. ఆ కారణంగా గత ఆరు నెలలుగా అరుణా వాళ్ళింట్లోనే ఉంటోంది శ్రావణి. ఇక్కణ్ణుంచే ఆమెకు సంబంధాలు కూడా చూడ్డం ప్రారంభించారు త్వరగా పెళ్లి చేస్తే మంచిదన్న ఉద్దేశంతో. అదృష్టం కలిసొచ్చి ఓ నెల క్రితం చాలా మంచి సంబంధమే కుదిరింది శ్రావణికి. వచ్చే వేసవిలో పెళ్లికి ముహూర్తాలు కూడా నిశ్చయించేశారు. అంతకు ముందు తానింకొకర్ని ప్రేమించిన విషయమే గుర్తు లేనట్టు, శ్రావణి కూడా ఆ సంబంధానికి సంతోషంగా ఒప్పేసుకుంది. అలాంటి తరుణంలో అరుణ తన ప్రాణ స్నేహితురాలైన రామలక్ష్మితో నోరూరుకోక శ్రావణి కాలేజీలో ఎవరితోనో ప్రేమాయణం నడిపిందన్న విషయాన్ని చెప్పటం, ఎలా పాక్కిందో గాని ఆ విషయం అందరికీ తెలిసి పోవటం జరిగింది. దాన్ని గురించే స్నేహితురాళ్లిద్దరూ నంజుడు గుంజుడవుతుంటే శ్రావణి మధ్యలో ఊడిపడి ఆ సంగతి తనే బైట పెట్టానంటోంది!


ఆశ్చర్యం వెయ్యదూ మరి?

"అదేమిటి శ్రావణీ?! రేపో మాపో పెళ్లి పీటల మీద కెక్కబోతూ ఇలా పాత సంగతుల్ని తవ్వి పోసుకుంటారా ఎవరన్నా? నేనంటే ఏదో ఆడదాన్ని గనక నోట్లో నువ్వు గింజ నానక, రామలక్ష్మి నా ప్రాణ స్నేహితురాలు గనక దాన్తో అన్నాను. ఆ సరళ్తోగాని, మంజుల్తోగాని నీకేమంత స్నేహముందని వాళ్లముందు నోరు జారేవు? వాళ్లు ఊరంతా టాంటాం చేసేసి నట్టున్నారు... దాంతో ఇవుడందరూ నీ గురించే చెవులు కొరుక్కుంటున్నారు..." అంది అరుణ తేరుకున్నాక మరదల్ని మందలిస్తూ. అయితే ఆమె కంఠం మాత్రం తీవ్రంగా ధ్వనించలేదు. అందుక్కారణం ఆ విషయం రామలక్ష్మితో తను చెప్పడం కూడా తప్పే కదా అన్న గిల్టినెస్.

"నేనూ ఆడదాన్నే కదా వదినా! నా నోట్లోనూ నువ్వు గింజ నానలేదు. అయినా ఇపుడేం కొంప మునిగి పోయిందనీ?" అంటూ గమ్మత్తుగా నవ్వింది శ్రావణి.

స్నేహితురాళ్లిద్దరూ వెర్రి చూపు చూశారామె కేసి. 'ఇలా అంటోందేమిటి ఈ పిల్ల?! తన కొంపకి తానే నిప్పంటించుకున్నాంత పని చేసి?'

"అదేమిటి శ్రావణీ అలా అంటావు? ఒక పక్క నీకు సంబంధం ఖాయమై పోయింది. ముహూర్తాలు కూడా పెట్టేసుకున్నాం. అసలే మన కాలనీలో ఆ కుర్రాడి చుట్టాలు కూడా ఉన్నారు.



**వాంటెడ్**

స్వామినాథం అడిగాడు రంగనాథాన్ని -

'ధన సంపాదన కోసం మీ వాడు అమెరికా వెళ్లాడు కదా. ఏమయినా సంపాదించాడా?'

'ఆ.... వాడి ఆచూకీ తెల్పితే పదివేల డాలర్లు ఇస్తామంటున్నారట అమెరికా పోలీసులు.'

**- కె.వి. మధుసూదనరావు**
(కాకినాడ)

ఈ సంగతి వాళ్ల చెవిన పడి, వాళ్ల ద్వారా అతని చెవిన కూడా పడిందనుకో... అప్పుడేమవుతుంది? పెళ్లి చెడిపోదూ? కొంప మునిగిపోదూ?" అంది అరుణ ఆందోళనగా.

"ఏమీ మునిగిపోదు" అంటూ మళ్లీ గమ్మత్తుగానే నవ్వింది శ్రావణి.

"శ్రావణీ?!"

"అవునొదినా! ఎంతమంది చెవులు కొరుక్కున్నా నా పెళ్లికొచ్చే ప్రమాదమేమీ లేదు. ఎందుకంటే ... నేను కాలేజీలో ప్రేమాయణం నడిపిన వ్యక్తీ, రేపు నన్ను చేసుకోబోతున్న వ్యక్తీ ఒక్కరే కాబట్టి" అంటూ ఘొల్లున నవ్వింది.

"ఆఁ!!" అంటూ నోరు తెరిచింది అరుణ ఆశ్చర్యంగా.

నోరయితే తెరవలేదు గాని, రామలక్ష్మి కూడా అరుణ కన్నా ఎక్కువగానే ఆశ్చర్యపోయింది.

"నా పుస్తకాల్లో లవ్ లెటర్స్ దొరగ్గానే వాటిని చింపిపోగులు పెట్టి నా మీద తాడెత్తున లేచారే తప్ప అతనెవరని గానీ, అతని వివరాలేమిటని గానీ అడిగిన పాపాన్న పోలేదు అమ్మానాన్నా. పాత కాలపు భావాల కొద్దీ నేనేదో ఘోరమైన తప్పు చేసేసినట్టు భావించేసి, నన్ను తీసుకొచ్చి ఇక్కడ పడేశారు. నేను రఘుకి పరిస్థితంతా వివరిస్తూ ఉత్తరం రాశాను. దాంతో రఘు మా విషయం వాళ్లమ్మ గారితో చెప్పి ఇలా తెలివిగా వ్యవహారం నడుపుకొచ్చాడు. మంచి సంబంధం నా అదృష్టం కొద్దీ నన్ను వెదుక్కుంటూ వచ్చిందని మీరంతా సంబరపడిపోయారే తప్ప... నేను ప్రేమించిన అబ్బాయి అతనే అని మీరు ఊహించలేకపోయారు' అంటూ ఫకాలున నవ్వింది శ్రావణి.

దానితో సందేహాలన్నీ పటాపంచలైపోగా,

"అమ్మ నా మరదలా! మొత్తానికి గడుసు పిండానివే" అంటూ నెత్తిన ఓ మొట్టు మొట్టి, "ఈ విషయం పెళ్లి చూపులప్పుడే చెప్పండొచ్చుగా?" అంది అరుణ.

"పెళ్లయ్యాక చెప్పి మిమ్మల్నందర్నీ ఆశ్చర్యంలో ముంచెత్తాలని అనుకున్నాం. అందుకే వాళ్లమ్మగారు గాని, సంబంధం తెచ్చిన పంతులు గారు గాని నోరు జారలేదు" అంటూ ఆ సందేహాన్ని కూడా తీర్చేసింది శ్రావణి.

"మరి ఇంత గుంభనంగా ఉన్నదానివి ఆ మంజులకీ, సరళకీ ఎందుకు చెప్పేశావ్?" అంది అరుణ.

మంజులా, సరళలు అరుణా వాళ్ల ఎదురింట్లో ఉండే ప్లీడరు గారి అమ్మాయిలు, శ్రావణికి సమ వయస్కులు. అందువల్ల ఆరు నెలల స్వల్ప వ్యవధి లో వాళ్ల మధ్య గట్టి స్నేహమే ఏర్పడి పోయింది.

"ఫ్రెండ్స్ కదా, థ్రిల్లింగ్ ఉంటుంది కదాని చెప్పాను. ఈ రహస్యం ఇంకెవ్వరితోనూ చెప్పొద్దని ప్రామిస్ కూడా తీసుకున్నాను. కానీ ఏం లాభం? వాళ్లూ ఆడవాళ్లే కదా, వాళ్ల నోళ్లల్లోనూ నువ్వు గింజ నానలేదు మరి" అంటూ నవ్వేసింది శ్రావణి. ●